పాఠకులకు, ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు

www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి: 02, సంచిక: 65, సోమవారం, 25.12.2023



## నారాయణపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఎదురెదురుగా ఢీకొన్న కార్లు..
- స్పాట్‌లో ఐదుగురు దుర్మరణం
- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న నలుగురు

2లో



# పల్లెల్లో కాంగ్రెస్ ప్రజాపాలన

- డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు..
- అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో సభలు
- వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలే ధ్యేయం
- రోజుకు 18 గంటలు తప్పకుండా పని చేయాలె
- ఎస్ ఆర్ శంకరన్ ఆదర్శంగా పనిచేయాలి
- కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం రేవంత్‌రెడ్డి వార్నింగ్
- సెక్రటేరియట్‌లో ఉన్నతాధికారులు, మంత్రులతో భేటీ

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి కలెక్టర్లతో సమావేశమయ్యారు. ఆదివారం సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, తదితర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు ఎస్పీలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సీఎస్ శాంతికుమారి ప్రారంభోపన్యాసం చేశారు. కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ నెల 28 నుంచి 6 వ తేదీ వరకు రాష్ట్రంలో ప్రజాపాలన నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులలో గ్రామ సభలు నిర్వహిస్తాం. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం.2 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభలు నిర్వహిస్తాం'అని తెలిపారు. ప్రజా పాలనను అందించడంపైనే ఈ సమావేశంలో ప్రధానంగా సీఎం కలెక్టర్లతో చర్చించారు. జనవరి నెలాఖరు వరకు పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నందున ఆరు గ్యారంటీలను వీలైనంత త్వరగా అమలు చేసే విషయంలో సీఎం కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

**అధికారులకు హెచ్చరికలు..**

జిల్లా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో సమావేశం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. ప్రతి అధికారి పూర్తి స్థాయిలో తమ విధులను నిర్వహించాలని, చేయలేని వారు తమ బాధ్యతల నుంచి తప్పుకోవచ్చని పేర్కొన్నారు. రోజుకు 18 గంటలు పని చేయాలని, పని చేయడం ఇష్టం లేని వాళ్లు సీఎస్, డీజీపీ కి చెప్పి తప్పుకోవచ్చన్నారు. ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి గ్రామ సభల పై సమీక్షలు ఉంటాయన్నారు. 'ప్రభుత్వం చాలా ఓపెన్ మైండ్‌తో ఉంది. అధికారులు ఇచ్చే సలహాలు సూచనలు కూడా ప్రభుత్వం తీసుకుంటుంది. ఎస్ ఆర్ శంకర్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్క అధికారి విధులను నిర్వర్తించాలి. మాది ఫ్రెండ్లీ గవర్నమెంట్.. ప్రజలతో ఫ్రెండ్లీగా మిగతా 2లో

# తెలంగాణలో చలి పంజా..



సింగిల్ డిజిట్‌కు పడిపోయిన ఉష్ణోగ్రతలు! • ఉదయం పది దాటినా కమ్మేస్తున్న పొగమంచు • రోడ్లపై వాహనదారుల ఇబ్బందులు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణలో చలి పంజా విసురుతోంది. ఈశాన్యం నుంచి గాలులు వీస్తుండటంతో..గత పది రోజులుగా రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. ఆదివారం రాత్రి పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. కొమరంభీం, ఆసిఫాబాద్ జిల్లాలలో 8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సిర్పూర్‌లో 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు సోనాలలో 8.5 ఉష్ణోగ్రతలు నమోదు. బేల 9.2, బజార్ హత్నూర్‌లో 9.3, పొచ్చెరలో 9.5, పెంబిలో 9.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోనే చలి తీవ్రత ఎక్కువగా ఉంది. రాబోయే 23 రోజులు చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తర, ఈశాన్యం నుంచి వీస్తున్న గాలుల కారణంగా చలి ప్రభావం ఎక్కువగా ఉందని చెప్పారు. చలికి తోడు పొగ మంచు భారీగా పేరుకుపోయింది. ఉదయం 9 గంటల వరకు మంచు వీడటం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా సగటు పగటి ఉష్ణోగ్రత 25 నుంచి 30 డిగ్రీల మధ్య నమోదవుతోంది. ఆదివారం సంగారెడ్డిని భారీగా మంచి కమ్మేసింది. నాందేడ్‌అఖోల నేషనల్ హైవే 161ని పొగమంచు పూర్తిగా కమ్మేసింది. ఉదయం 10 దాటినా.. రోడ్డుపై పొగమంచు దట్టంగా కమ్ముకుంది. హైవేపై కనుచూపు మేరలో వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారు. కొందరు తప్పనిసరి పరిస్థితిలో లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళుతున్నారు.

## అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన మైలారం



2లో

# ఆరుగురు ఐఏఎస్‌లు, ఒక ఐపీఎస్ బదిలీ

రంగారెడ్డి కలెక్టర్‌గా గౌతమ్ పోట్రు • భారతీ హోళీకేరీపై బదిలీ వేటు

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ఏడుగురు సివిల్ సర్వెంట్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. వారిలో ఆరుగురు ఐఏఎస్‌లు, ఒక ఐపీఎస్ అధికారిని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదివారం బదిలీల ఉత్తర్వులను జారీ చేసింది. ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా జ్యోతి బుద్ధప్రకాశ్, ఎక్సైజ్ కమిషనర్‌గా ఇ.శ్రీధర్‌ను నియమించింది. అలాగే టీఎస్‌ఐఐసీ ఎండీగా ఇ.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది. పౌరసరఫరాల కమిషనర్‌గా దేవేంద్ర సింగ్ చౌహాన్(ఐపీఎస్)కు బాధ్యతలు అప్పగించింది. ఇంటర్ విద్య డైరెక్టర్‌గా శ్రుతి ఓజా, గిరిజ సంక్షేమ డైరెక్టర్‌గా ఈవీ నర్సింహారెడ్డిని నియమించారు. ఇక రంగారెడ్డి





జిల్లా కలెక్టర్ భారతి హోలికేరిపై బదిలీ వేటు వేసిన ప్రభుత్వం ఆమెకు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. జేఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది. భారతి స్థానంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా గౌతమ్ పొత్రుకు బాధ్యతలు అప్పగించింది. ఇంటర్ బోర్డు కార్యదర్శిగా శృతి ఓజా, గిరిజన సంక్షేమ డైరెక్టర్‌గా ఈవీ నర్సింహారెడ్డిని నియమించింది.

# తెలంగాణ ఉమ్మడి జిల్లాలకు ఇన్ చార్జి మంత్రుల నియామకం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, మంత్రివర్గ కూర్పు పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఇదివరకే కొన్ని హామీలు అమలు చేయగా, మరికొన్ని హామీల అమలుతో పాటు పాలనలో తమదైన మార్క్ చూపించేందుకు సీఎం రేవంత్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో ఉమ్మడి జిల్లాలకు మంత్రులను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం అమలును సమీక్షించి, పర్యవేక్షించనున్నారు.

**ఉమ్మడి జిల్లాలకు ఇన్ చార్జి మంత్రులు వీరే..**

1.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి - కరీంనగర్
2.దుద్దిళ్ల శ్రీధర్ బాబు - రంగారెడ్డి
3.పొన్నం ప్రభాకర్ - హైదరాబాద్
4.దామోదర రాజనరసింహ - మహబూబ్ నగర్
5.కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి - ఖమ్మం
6.పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి - వరంగల్
7.కొండా సురేఖ - మెదక్
8.అనసూయ సీతక్క - ఆదిలాబాద్
9.తుమ్మల నాగేశ్వర రావు - నల్గొండ
10.జూపల్లి కృష్ణారావు - నిజామాబాద్



# కేంద్రం చెప్పేది నిజం కాదు..

- జమ్ముకశ్మీర్‌లో సజీవంగానే ఉగ్రవాదం
- ఆర్టికల్ 370 రద్దుతో ఉగ్రవాదం అంతమైనట్లు కేంద్రం ప్రచారం
- నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైందంటూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలపై నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా విర్శమలు గుప్పించారు. బీజేపీ చెబుతున్నట్టుగా జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం ఇంకా అంతం కాలేదని అన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా కూకటివేళ్లతో నిర్మూలించడానికి అవసరమైన మూల కారణాలను గుర్తించాలన్నారు. ఆదివారం జరిగిన ఓ పుస్తకావిష్కరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం చెబుతున్నట్టుగా ఇక్కడ ఇంకా శాంతి నెలకొనలేదని, ఉగ్రవాద సమస్య సజీవంగానే ఉందని అబ్దుల్లా చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుతో మిగతా 2లో





# డ్యాన్స్ చేస్తూ నడిరోడ్డుపై యువతి రచ్చ..

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అసహనం
- వెర్రి వేషాలు వేయొద్దని సీరియస్
- సోషల్ మీడియా వేదికగా ఫైర్

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

రాత్రికి రాత్రే సోషల్ మీడియా స్టార్ అయ్యేందుకు ఓ యువతి చేసిన రచ్చపై ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మండిపడ్డారు. నడిరోడ్డుపై ఈ వెర్రి చేష్టలు ఏంటంటూ ఫైర్ అయ్యారు. కాగా ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వల్ల యువత సోషల్ మీడియాకు బాగా అడిక్ట్ అయ్యింది. లైక్స్, వ్యూస్ మోజులో ఏం చేస్తున్నారో కూడా ఆలోచించడం లేదు. కొత్తగా ట్రై చేసి ఫాలోవర్స్ పెంచుకోవడం అత్యుత్సాహం ప్రదర్శించి వార్తల్లోకి ఎక్కుతున్నారు. రకరకాల విన్యాసాలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాజా ఫాలోవర్స్, వ్యూస్ కోసం ఓ యువతి చేసిన రచ్చ ఏకంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కే అసహనం తెప్పించింది. స్కూల్ డ్రెస్‌లో ఉన్న ఓ యువతి

# శ్వేతం వర్సెస్ స్వేదం..

## తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అప్పు.. రూ.3.17 లక్షల కోట్లే



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ బురద జల్లే ప్రయత్నమని ఫైర్
- అంకెల గారడీతో ప్రజలను ఆగమాగం చేస్తున్నరు..

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రానికి కౌంటర్ గా బీఆర్ఎస్ స్వేదపత్రాన్ని విడుదల చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థికపరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తెలంగాణను బీఆర్ఎస్ అప్పుల పాలు చేసిందని తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో డిసెంబర్ 24న ఆదివారం తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి కేటీఆర్.. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రం తప్పుల తడకగా, అంకెల గారడీగా ఉందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ ఏర్పడక ముందు రూ.72 వేల కోట్ల పాత అప్పులు కూడా ఉన్నాయన్నారు. ఈ తొమ్మిదిన్నరేళ్ల కాలంలో మేం రూ.3లక్షల 17వేల 51 కోట్లు మాత్రమే అప్పు చేశామని తెలిపారు. అర్ బిఐ నివేదికలనే మేం ప్రజల ముందుంచుతున్నారు. కానీ, రాష్ట్రం అప్పు రూ.6.70లక్షల కోట్లు ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపుతున్నారని మండిపడ్డారు.

**శ్వేత పత్రం అంకెల గారడీ..**

రాష్ట్రంలో కొత్తగా కొలువైన ప్రభుత్వం అప్పుల పేరుతో తమపై అభాండాలు వేసిందని, శ్వేతపత్రం పేరుతో అంకెల గారడీ చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిగతా 2లో

## కాంగ్రెస్ బురద జల్లే ప్రయత్నం

ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన రుణాలు, ఇవ్వని రుణాలు కూడా అప్పులుగా చూపుతున్నారని అన్నారు. కాంగ్రెస్.. మాపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఆర్టీసీ, విద్యుత్, పౌరసరఫరాల్లో లేని అప్పు ఉన్నట్లు చూపించారనని ఆయన మండిపడ్డారు. పౌర సరఫరాల సంస్థకు ఇప్పటివరకు ఉన్న అప్పు రూ.21,029 కోట్లు మాత్రమేనని చెప్పారు. నిల్లు, కేంద్ర నుంచి రావాల్సిన డబ్బులు దాచి.. అప్పులు ఎక్కువగా ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతుందని కేటీఆర్ తెలిపారు.







# అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన మైలారం

**ఎస్ఆర్ఆర్ ఫార్చ్యూన్ ఇన్‌ఫ్రా అధినేత శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మహా పడిపూజ ● రెండు వేల మంది వరకు పాల్గొన్న అయ్యప్పలు, భక్తులు ● ఆట పాటలతో అలరించిన భజన బృందం, చూపరులను అలరించిన అయ్యప్ప అలంకరణ అభిషేకాలు**



**మైలారం, విశాల భారతి:** అయ్యప్ప స్వామి ఎక్కడో ఉండరని, మాలధారణ చేసిన ప్రతి వ్యక్తిలోనూ ఉంటారని శ్రీ ధర్మశాస్త్ర గురుస్వామి శివ అయ్యం గారు అన్నారు. ప్రముఖ రియల్ఎస్టేట్‌కంపెనీ 'ఎస్ ఆర్ ఆర్‌ఫార్చ్యూన్‌ఇన్‌ఫ్రా' అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్‌జిల్లా, రాయపర్తి మండలం.. మైలారం ఆయన స్వగ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యాపార రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూనే.. అదే స్థాయిలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ముందుండే శ్రీనివాస్ రెడ్డి దంపతులు భక్తి భావంతో అయ్యప్ప మహాపడిపూజను వైభవంగా జరిపించారు. రెండు వేల మందికి పైగా అయ్యప్ప మాలదారులు, భక్తులను ఆహ్వానించి వారికి తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ గురుస్వామి శివ అయ్యంగారు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు, సుగంధ ద్రవ్యాల, వివిధ రకాల ఫలాభిషేకాలు శాస్త్రోపేతంగా వేదమంత్రాలు నడుమ పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి చరిత్ర , 18 మెట్లలో కొలువైన దేవతల స్వామివారి మాల ధారణ విశిష్టతను, స్వాములు ఆచరించాల్సిన నియమ నిబంధనలను పూర్తిగా వివరించారు. దీక్షను నియమాలకు అనుగుణంగా అయ్యప్ప స్వామి వారి కరుణాకటాక్షాలు ఉంటాయని తెలిపారు. మైలారం ప్రాంతంలో 33 ఏండ్లుగా అయ్యప్ప దీక్షను తీసుకొని భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఎంతో ఘనంగా పడిపూజలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామం అయ్యప్ప శరణు ఘోషతో ధర్మరాజ్యం కావాలని ఆకాంక్షించారు. అయ్యప్ప అనే పేరులో కులం, మతం, ప్రాంతం, వర్ణన, వర్గం లేదని ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అనంతరం పూజా కార్యక్రమానికి హాజరైన పీఏసీఎస్ చైర్మన్, వరంగల్ డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్ మాట్లాడుతూ.. అయ్యప్ప మహాపడిపూజ కన్నుల పండువగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎస్ఆర్ఆర్ అధినేత శ్రీనివాస్‌రెడ్డి ఏ కార్యక్రమం మొదలు పెట్టినా దిగ్విజయంగా పూర్తి చేస్తారని కొనియాడారు. రెండు వేల మందికి పైగా అయ్యప్పలకు తీర్థ ప్రసాదాలు అందించడం గొప్ప విషయమన్నారు. ఇప్పటి వరకు వారు ఏ కార్యక్రమం తలపెట్టినా దిగ్విజయమవుతోందని, వారు ముందు ముందు ఇలాగే స్వచ్ఛంద, ఆధ్యాత్మిక రంగాల్లో ముందుగు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం కీర్తి మీడియా హౌజ్ డైరెక్టర్ మాదారపు అశోక్‌మాట్లాడుతూ.. పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఎంత ఎత్తుకు ఎదిగినా.. మూలాలు మరువని మానవతా మూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి ఎస్సై విజయ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి హాజరవ్వగా.. రాయపర్తి మండల బ్లాక్ కాంగ్రెస్‌ప్రెసిడెంట్ హమ్యా నాయక్, ప్రముఖ రియల్ఎస్టేట్‌కన్సల్టెంట్ ఎ.శ్రీనివాస్, పెస్ట్ కంట్రోల్ బిజినెస్ మెన్‌సురేందర్‌గౌడ్, ఎమ్మిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పరుపాటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు, అయ్యప్ప భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.














## కేంద్రం చెప్పేది నిజం కాదు..

**మొదటిపేజీ తరువాయి**

జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైనట్లు కేంద్రం ప్రచారం చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. వాస్తవ పరిస్థితులు ఇక్కడ అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లాలో ఉగ్రవాదుల దాడుల్లో మాజీ పోలీస్ అధికారి మొహమ్మద్ షఫీ మరణంపట్ల తాను తీవ్రంగా చింతిస్తున్నట్లు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో శాంతి నెలకొందని చెబుతున్న కేంద్రం ఇప్పుడు ఈ ఘటనపై ఎందుకు మౌనంగా ఉందని మండిపడ్డారు. ఉగ్రవాదం విషయంలో కేంద్రం కేవలం గాయాలకు మందు రాస్తున్నదని, దాని మూల కారణాన్ని గుర్తించడం లేదని విమర్శించారు. కశ్మీర్‌లో రక్తపాతాన్ని అంతం చేడానికి కేంద్రం సరైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేయకుండా కశ్మీర్‌లో శాంతి గురించి, పర్యాటకం గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు.

## పల్లెల్లో కాంగ్రెస్ ప్రజాపాలన



**మొదటిపేజీ తరువాయి**

ఉన్నంతవరకే ఫ్రెండ్లీ గవర్నమెంట్. అధికారులు సంక్షేమం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది.అధికారులు ప్రజల మనసును గెలిచి మంచి పేరు తెచ్చుకోవాలి. అధికారులు ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఎక్కడైనా పని చేయగలను అన్న ఆలోచనలో ఉండాలి. తెలంగాణ డీఎన్‌ఏ స్వేచ్ఛను హరిస్తే సహించదు. ఆరు గ్యారంటీలు అమలుకు మీరే మా సారథులు. పనిచేయడానికి ఇబ్బందికరమైన అధికారులు ఎవరైనా ఉంటే సీఎస్ డీజీపీకి చెప్పి తమ బాధ్యతల నుంచి తప్పుకోవచ్చు. అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం. కబ్జాదారులు, రక్ష సరఫరాదారుల పై కటినంగా వ్యవహరించాలి. భూ కబ్జా అనే పదం ఈ రాష్ట్రంలో వినిపించకూడదు. బుక్ మై షో సన్ బర్న్ నిర్వహణ పైన పోలీసులు నిగా పెట్టి అసలు విషయం తేల్చాలి. గంజాయి పై కఠినంగా పోలీసులు వ్యవహరించాలి సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచాలి. గంజాయి విస్తరణ కాలేజీలో చేరింది. పోలీసులు వీటిపై చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు సరఫరా నిగా పెట్టాలి నిబంధనలో అతిక్రమిస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలను కొన్ని కార్పొరేట్ వ్యవస్థలే అమ్ముతున్నాయి ఇలాంటి వాళ్లను లిస్టు తయారుచేసి ఉక్కు పాదం పెట్టాలి' అని ఆదేశించారు. సచివాలయంలో జరిగిన ఈ కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శ్వేతం వర్సెస్ స్వేదం..

**మొదటిపేజీ తరువాయి**

కేటీఆర్ విమర్శించారు. వాస్తవానికి బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో పేదరికం బాగా తగ్గిందని చెప్పారు. ఎన్ఎఫ్ హెచ్ఎస్ డాటా ప్రకారం తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో పేదరికం 21.92 శాతం ఉండగా, మేం దిగిపోయే నాటికి కేవలం 5.8 శాతానికి చేరిందని తెలిపారు. దేశంలోని మరే రాష్ట్రంలో ఇంత వేగంగా పేదరికం తగ్గలేదన్నారు. ఇలా అన్ని విషయాల్లో తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందని, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసిందని ఆయన చెప్పారు. ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనకు బృందాలను పంపాయని, వాళ్ల రాష్ట్రాల్లో కూడా వాటిని అమలు చేశాయని తెలిపారు. శ్వేతపత్రంలో ప్రభుత్వం చెప్పిన అప్పుల లెక్కల గురించి ఆయన మాట్లాడుతూ.. 'నిన్నగాక మొన్న కొలువదీరిన తెలంగాణ ప్రభుత్వం శ్వేత పత్రం పేరిట అంకెల గారడీ చేసింది. అప్పుల పేరుతో అభాండాలు వేసింది. వాళ్లు శ్వేతపత్రంలో చెప్పిన ప్రకారం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి లోపల తెలంగాణ అప్పులు రూ.3,89,673 కోట్లు. అంతకుముందు వాళ్ల ప్రభుత్వం మాకిచ్చి పోయిన అప్పులు72,658 కోట్లు. స్థూలంగా మా ప్రభుత్వం తెచ్చిన అప్పులు 3,17,015 కోట్లు మాత్రమే. ఈ అప్పును వాళ్లు రూ.6.71 లక్షల కోట్లుగా చూపించారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వ గ్యారంటీ ఉన్న ఎస్‌పీవీ అప్పులు రూ.1,27,208 కోట్లు కాగా, ఎస్‌పీవీ రుణాలు రూ.1,18,557 కోట్లు. ప్రభుత్వ హామీ లేని రుణాలు మరో రూ.59,414 కోట్లు. అయితే ఈ మూడు రకాల రుణాలు ప్రభుత్వ అప్పులు కావు. కానీ, కొత్త ప్రభుత్వం మాత్రం తాము తెచ్చిన రూ.3,17,015 కోట్ల అప్పులకు పై మూడు రకాల అప్పులను కూడా జతచేసి బీఆర్ఎస్ ప్రభుత్వం మొత్తం రూ.6,71,757 కోట్ల అప్పులు చేసినట్లుగా చూపించింది. కానీ, మేం దిగిపోయే నాటికి ఉన్న అప్పు మాత్రం కేవలం రూ.3,17,015 కోట్లు మాత్రమే. ప్రభుత్వం రూ.6.71 లక్షల కోట్లుగా చెప్పడం శుద్ధ అబద్ధం' అన్నారు. ప్రభుత్వం చూపించిన లెక్కలు తప్పుల తడకలుగా ఉన్నాయని చెప్పడానికి సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అప్పులను ఉదాహరణగా తీసుకున్నారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అప్పుల గురించి ఆయన ఏమన్నారంటే.. 'సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో రూ.56 వేల కోట్ల అప్పు ఉందని శ్వేతపత్రంలో ప్రభుత్వం చెప్పింది. అది పూర్తిగా తప్పు. వాస్తవానికి సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్‌లో దాదాపు రూ.30 వేల కోట్ల విలువచేసే ధాన్యం ఉంది. ఆ ధాన్యం అమ్మితే రూ.30 వేల కోట్లు వస్తాయి. అమ్మిన ధాన్యానికి రావాల్సిన నిధులు రూ.16 వేల కోట్లు ఉన్నాయి. ఉన్న ధాన్యం విలువను, అమ్మిన ధాన్యానికి రావాల్సిన నిధులను లెక్కలోకి తీసుకోకుండా సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు రూ.56 వేల కోట్లు అప్పులు ఉన్నయని ప్రభుత్వం చెబుతున్నది.

## నారాయణపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**విశాల భారతి, నారాయణపేట:** నారాయణపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జిల్లాలోని మక్తల్ నియోజకవర్గంలోని జక్లేరు 167 జాతీయ రహదారిపై బొందల కుంట గ్రామం వద్ద ఎదురెదురుగా వచ్చిన రెండుకార్లు బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక వాహనంలో ఉన్న వారిలో ఇద్దరు, మరో వాహనంలో ఉన్న ముగ్గురు చనిపోయారు. తీర్థ యాత్రలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మరో నలుగురు క్షతగాత్రులను మక్తల్ ఆసుపత్రికి తరలించారు. మృతుల వద్ద ఉన్న ఆధార్ కార్డు, ఫోన్ల ఆధారంగా మహారాష్ట్ర, కర్ణాటక వాసులుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం కటక్ జిల్లాకు చెందిన దీపక్ సమాల్ కర్ణాటక రాష్ట్రంలోని కార్వార్ లో నేవి ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ కర్ణాటకకు



బదిలీ అయ్యాడు. దీంతో ఆయన తన భార్య భవిత సమాల్ (32), కూతురు అవిస్మిత (7) తో కలిసి కారులో రాయచూర్ మక్తల్ మీదుగా బయలుదేరాడు. కర్ణాటక లోని యాదగిరి జిల్లా సైదాపూర్ గ్రామానికి చెందిన మౌలాలి (52), రెహమాన్ బేగం (52), ఖలీల్ (43) వడివాల్ కారులో హైదరాబాద్ లో పనులు ముగించుకొని తిరుగు పయనం అయ్యారు. ఎదురు ఎదురుగా వేగంగా వస్తున్న ఈ రెండు కార్లు బొందల కుంట గ్రామం మలుపు వద్ద ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే నేవీ అధికారి దీపక్ సమాల్ భార్య భవిత సమాల్, కూతురు అవిస్మిత స్పాట్‌లోనే చనిపోయారు. దీపక్ సమాల్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో కారులో ఉన్న మౌలాలి, రెహమాన్ బేగం, ఖలీల్ అక్కడికి అక్కడే మృతి చెందగా వడివాల్ తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటన జరిగిన వెంటనే ప్రమాద తీవ్రత తో రోడ్డుపై పడి ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు కార్లలోనే ఉండిపోవడంతో సమీపంలో ఉన్న వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మక్తల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని సమాచారాన్ని వారి వారి కుటుంబ సభ్యులకు చేరవేసే ప్రయత్నాలు చేస్తున్నారు.



# రాజకీయాల్లో ఓపిక ఉండాలి

**బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్.**

**ముషీరాబాద్,విశాలభారతి:** ప్రస్తుత రాజకీయాలు వేరని ఉన్నఫలంగా ఏవి రావని కష్టపడి పని చేస్తేనే గుర్తింపు ఉంటుందని బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. రాజకీయాల్లో ఉండే వారికి ఓపిక చాలా అవసరమని అన్నారు. 25 సంవత్సరాలుగా బిజెపి కోసం పనిచేస్తున్న గంటా శ్రీనివాస్ సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులుగా నియమితులైన సందర్భంగా ఆదివారం గాంధీనగర్ లోని డాక్టర్ కే లక్ష్మణ్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కష్టపడి పని చేస్తే పదవులు అవే వస్తాయని, మనం ఎక్కడికి పోవాల్సిన అవసరం కూడా ఉండదన్నారు. పార్టీ కోసం పని చేసే వారిని పార్టీ గుర్తిస్తుందని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బూతు స్థాయి నుండి బిజెపిని పటిష్టం చేసి మరోసారి మోడీకి బీజేపీకి పటం కట్టే విధంగా పనిచేయాలని సూచించారు. సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు గంటా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రేక్షకులు ప్రజల అభీష్టం మేరకు పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్,కొలన్ రాజేందర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నార్కట్ పల్లి,విశాలభారతి:** నార్కట్ పల్లి మండలం అమ్మనబోలు జెడ్పిహెచ్ స్ లో 20002001 సం.లో లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరిగింది. దాదాపు 22 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. ఇక్కడ చదవిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి దేశ, విదేశాల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 22 సంవత్సరాల తరువాత అందరం కలుసుకుని తీపి జ్ఞాపకాలను తిరిగి ఆస్వాదించేలా చేసుకోడం చదువు నేర్పిన గురువులను సన్మానించు కోవడం, ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, యాదయ్య, వెంకట్రాజు, వెంకట్ నారాయణ, బిక్షపతీ, రాంరెడ్డి,గ్రామ సర్పంచ్ బద్దం వరలక్ష్మి రాంరెడ్డి, ఎంపీటీసీ కొంపెల్లి సైదులు, పూర్వ విద్యార్థులు బచ్చయ్య, రాజశేఖర్ రెడ్డి, రమేష్, వెంకటేష్, సంధ్య, సైదులు, జలయ్య, యాదయ్య.

# డ్యాన్స్ చేస్తూ నడిరోడ్డుపై యువతి రచ్చ..



**మొదటిపేజీ తరువాయి**

నడిరోడ్డు మీదకు వచ్చి డ్యాన్స్ చేసిన సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ట్రాఫిక్ ఉన్న రోడ్డుపై పడుకుని డ్యాన్స్ చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించింది. రద్దీగా ఉన్న ఓ రోడ్డు మధ్యలోకి ఓ అమ్మాయి నడుచుకుంటూ వచ్చింది. ఆ తర్వాత తన కాలేజీ బ్యాగ్‌ను పక్కకు పడేసింది. వెంటనే రోడ్డుపై పడుకుని స్టెప్పులు వేసింది. అప్పటికే సిగ్నల్ పడి ఉండటంతో అక్కడ ఉన్న వాహనదారులంతా ఆమెను వింతగా చూడటం ఈ వీడియోలో కనిపించింది. 23 సెకన్ల పాటు ఉన్న ఈ వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇదే వీడియోను టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కూడా తన ట్విట్టర్ (ఎక్స్) ద్వారా షేర్ చేశారు. 'నేటి యువతకు ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ పిచ్చి పట్టుకోవడం చాలా బాధాకరం. సమాజానికి పనికొచ్చే పనులు చేసి నలుగురికీ ఆదర్శంగా నిలవాల్సిన యువతరం.. సోషల్‌మీడియా మత్తులో జీవితాలను నాశనం చేసుకుంటుంది. సోషల్ మీడియాలో రాత్రికి రాత్రే పాపులర్ కావడం కోసం నడిరోడ్డుపై ఇలాంటి వెర్రి చేష్టలు చేస్తూ ఇతరులకు తీవ్ర అసౌకర్యం కల్పించడం ఏం ఆనందమో'అని ట్వీట్ లో పేర్కొన్నారు.

# ప్రజా దర్బార్ పొమ్మంది.. బీఆర్ఎస్ ఆదుకుంది!

- ఇల్లందు అన్నపూర్ణకు అండగా నిలిచిన కేటీఆర్
- బాధితురాలికి రూ. 1లక్ష ఆర్థిక సాయం
- ప్రజావాణి ఆరంభ శూరత్వమేనన్న విమర్శలు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



'ప్రజల కష్ట సుఖాలు వింటాం.. అండగా నిలబడతాం' అంటూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల పాటు హడావిడి చేసిన ప్రజాదర్బార్ ప్రచారానికి మాత్రమే పరిమితమైనట్లు విమర్శలు వస్తున్నాయి. ఇల్లందు పట్టణం ఆజాద్ నగర్ కి చెందిన అన్నపూర్ణ వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి హైదరాబాద్ కి వచ్చింది. పత్రికల్లో, టీవీలలో ప్రజా దర్బార్ ప్రచార ఆర్భాటాన్ని చూసి నాలుగు సార్లు దరఖాస్తు ఇచ్చానని తెలిపింది. దరఖాస్తు తీసుకోవడం మినహా ఇంకా మిగిలిన సమాచారం కానీ.. ఎలాంటి స్పందన కానీ రాలేదని తెలిపింది. తన ఆర్థిక కష్టాలను, తన పిల్లల చదువుల ఇబ్బందులను, తన దుర్భరమైన జీవితాన్ని వివరించినా... ప్రజా దర్బార్ లో ఊరట దక్కలేదు అని వాపోయింది. వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చి ప్రజాదర్బార్‌లో నాలుగు సార్లు దరఖాస్తులు పెట్టుకున్న దయ తలచలేదని, అసెంబ్లీ వద్దకు వెళ్లి సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు రోజంతా కాపలా కాస్తే పోలీసులు తిప్పిపంపారని తెలిపింది. అయితే చివరగా తెలంగాణ భవన్ వెళ్లి కేసీఆర్ ను, కేటీఆర్ ను కలిస్తే న్యాయం జరుగుతుందని చెప్తే.. తెలంగాణ భవన్ చేరుకున్నానని, కేటీఆర్ ని కలిసిన వెంటనే ఆయన తన బాధ విని వ్యక్తిగతంగా రూ. 1లక్ష ఆర్థిక సాయం అందించారని అన్నపూర్ణ సంతోషం వ్యక్తం చేసింది. అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల కష్ట సుఖాలు వినడానికి.. సాధ్యమైనంత వరకు సాయం చేయడానికి ముందుకు వచ్చిన కేటీఆర్ కి అన్నపూర్ణ కృతజ్ఞతలు తెలిపింది.



అప్ షాబాద్ మహనీయుల ముందు నుంచి పారుతున్న మురుగు నీరు



షాబాద్ పట్టించుకోని సర్పంచ్ పరిశుద్ధ కార్మికులు

# మహనీయుల సాక్షిగా రోడ్డుపై పారుతున్న మురుగునీ

**షాబాద్,విశాలభారతి:**

జాతీయ రహదారులకు లింకు రోడ్డు... ముంబై బెంగళూరు జాతీయ రహదారులకు లింక్ రోడ్డు అయిన నాగర్ గూడ చౌరస్తా... ప్రతినిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి. నాలుగు రోడ్లకు ప్రధాన కూడలి... అక్కడే మహనీయుల విగ్రహాలు ఉన్నాయి. రోడ్డుపై వెళ్లే వారందరికీ ఈ మురుగు నీటి దుస్థితి కనిపిస్తుంది. కానీ ఎవరూ పట్టించుకోరు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం నాగర్ గూడ చౌరస్తాలో ఒకవైపు చేవెళ్ల మరొకవైపు షాబాద్ మరొకవైపు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విమానాశ్రయానికి వెళ్లే రహదారి.. మరొక రహదారి నాగర్ గూడ గ్రామానికి వెళ్తుంది. ఇది ఎక్కడో కాదు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం నాగర్ గూడ చౌరస్తాలో అతిపెద్ద నాలుగు లైన్ల రహదారికి పక్కనే రోడ్డుపై వెళ్లే వారందరికీ కనిపిస్తుంది. కానీ ఎవరూ పట్టించుకోరు. ఇన్నాళ్లు ఎన్నికల హడావుడిలో ఎంతోమంది కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి తదితర పార్టీలతోపాటు పోటీలో ఉన్న అభ్యర్థులందరూ ఈ దారి గుండానే ఎంతో హంగామా చేస్తూ ఓట్ల కోసం తిరిగారు. ఇక ఇంకో కొత్త గమ్మత్తు ఏందంటే ఈ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో చేసిన వారంతా ముందుగా ఇక్కడే ఉన్న మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేయడానికి వెళ్లే ప్రతి ఒక్కరికి ఈ మురుగు కాల్వ కనిపిస్తుంది. కానీ ఎందుకో ఏమో ఎవరూ కూడా పట్టించుకోలేదు. గత కొన్నాళ్లుగా అంతర్గత భూగర్భ మురుగు కాలువ మ్యానువల్ పగిలి మురుగు నీరు అంతా ఆ విగ్రహాల ముందు నుంచే రోడ్డుపై ప్రవహిస్తుంది. అక్కడే హోటల్లు దుకాణాలు ఉంటాయి. శంషాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులంతా ఇక్కడే నిలబడి బస్సుల్లో ఎక్కుతుంటారు .ఈ మురుగు కాలువ దుర్గంధం పట్టలేక ముక్కులు మూసుకొని కూర్చుంటారు. ఇటీవల ఎన్నికలలో ఓడిపోయిన నాయకులు గెలిచిన నాయకులు డిపాజిట్లు కోల్పోయిన నాయకులు కూడా ఈ మురుగు కాలువ గురించి పట్టించుకోలేరంటే ఈ నాయకులకు ప్రజా సమస్యలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని ప్రజలు చెప్పకనే చెబుతున్నారు. కాగా ఈ మురుగు కాలువ మరమ్మత్తు పనులు గ్రామపంచాయతీ వారు చేస్తారా లేక రోడ్లు భవనాల శాఖ అధికారులు చేస్తారా ఎవరికి అంతుపట్టని ప్రశ్న. ఈ మహనీయుల విగ్రహానికి అవతలి వైపు( చేవెళ్ల వెళ్లే వైపు ) కూడా చెత్తాచెదారం మురికి నీరు అంతా ప్రవహిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా కలెక్టర్ షాబాద్ మండల పరిషత్ అధికారులు స్పందించి మురుగు నీటి కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై షాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనురాధను ప్రజాదర్బార్ ప్రతినిధి ఫోన్లో వివరణ కోరగా షాబాద్ మండలం నాగర్ గూడ చౌరస్తా వద్ద ఉన్న మురుగు కాలువ సమస్య తన దృష్టికి వచ్చిందని మురుగు కా లువ మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# ఆదివాసీ విద్యార్థి సంఘం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక



**సికింద్రాబాద్,విశాలభారతి:** ఆదివాసీ విద్యార్థి సంఘం ( ASU ),నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివాసి పరిశోధక విద్యార్థి సాగబోయిన పాపారావు అధ్యక్షతన ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆదివాసి విద్యార్థి సంఘ రాష్ట్ర ఎన్ను కున్నారు. విద్యార్థి నాయకులు కొమురంభీం ఉద్యమ స్ఫూర్తితో ఉస్మానియా కేంద్రంగా ఉన్నత చదువులం కొనసాగిస్తూనే ఆదివాసి సమస్యలపై పరిశోధనాత్మక పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నూతన రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి,వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు, ప్రధాన కార్యదర్శులు అరేం అరుణ్ కుమార్, సున్నం సతీష్, కుర్నిబెల్లి గణేష్, వెడమ, కిషన్, ఉపాధ్యక్షులు గౌరీవేణి ప్రవీణ్ చర్ప రవి సొడే నవీన్,సిడం.రమేష్,సహాయ కార్యదర్శి కోరం ఎర్రయ్య,ప్రచార కార్యదర్శి గావీడి నాగబాబు ఇరుప ప్రభాకర్, కోశాధికారి వెంకన్న, సభ్యులుగా వట్టం నవీన్ నవీన్ బచ్చలి కుంజ రుక్మిణీ,లను ఎన్నుకున్నారు. ఉస్మానియా కేంద్రంగా ఆదివాసి విద్యార్థి,సామాజిక సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ASU తిరుగు లేని పోరాటాలను నిర్మిస్తుందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు అన్నారు.తనకు ఇచ్చిన ASU వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ చదువులతో పాటు ఆదివాసి విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేస్తానని సాగబోయిన పాపారావు ధీమా వ్యక్తం చేశారు.




# మార్కెట్లో కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి

**నేషనల్ కన్జ్యూమర్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ.**

**ముషీరాబాద్,విశాలభారతి:** మార్కెట్లో వస్తువులు సరుకులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజింగ్ సూచించింది. ఆదివారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ లాలాపేట్ శాంతినగర్ లో సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సివిల్ సప్లై అధికారులతో పాటు ఇతర అధికారులు శ్రీనాథ్, రత్న ప్రభాకరి హాజరై వినియోగదారుల హక్కుల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల గురించి తెలుసుకోవాలని, ప్రశ్నించే తత్వం కూడా ఉండాలని సూచించారు. హక్కులు ప్రశ్నించే తత్వం ఉన్నప్పుడే మార్కెట్లో జరిగే నేరాలను అరికట్టవచ్చన్నారు. సికింద్రాబాద్ సి ఆర్ ఓ అసెంబ్లీ అధ్యక్షులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ మార్కెట్లో కొనుగోలు చేసే సమయంలో మోస పూర్వక కార్యకలాపాలు ఎదురైతే సలహాలు సూచనలకు తమ సంస్థను సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు హరి శంకర్, ప్రవీణ్ కుమార్, మహేష్, బాల దుర్గానాథ్, అనిల్ కుమార్ తో పాటు కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తుడినా, దేశద్రోహినా అనేది ప్రజలు నిర్ణయిస్తారు

- పార్లమెంట్ ఘటనపై ఎంపీ ప్రతాప్ సింహా స్పందన
- ఆరోపణలపై నిర్ణయాధికారం దేవుడికి విడిచిపెడుతున్నా



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

రెండు వారాల క్రితం పార్లమెంట్‌లోకి చొరబడిన ఇద్దరు ఆగంతకులకు పాసులు జారీ చేసిన లోక్‌సభ సభ్యుడు, మైసూరు ఎంపీ ప్రతాప్ సింహా ఈ ఘటనపై తొలిసారి స్పందించారు. తాను దేశభక్తుడినా లేక దేశద్రోహినా అనేది 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు నిర్ణయిస్తారని అన్నారు. ఆదివారం మైసూరులో మీడియాతో మాట్లాడారు. తనపై వచ్చిన ఆరోపణలపై నిర్ణయాధికారం దేవుడికి, తన రచనలు చదివే పాఠకులకు విడిచిపెడుతున్నట్లు తెలిపారు. "ప్రతాప్ సింహా దేశద్రోహా, దేశభక్తుడా అనేది మైసూరు కొండల్లో వెలసిన చాముండేశ్వరీ మాతకు, బ్రహ్మగిరిలో వెలసిన కావేరి మాతకు, గత 20 ఏళ్లుగా కన్నడనాట నా రచనలు చదివే పాఠకులకు, మైసూరు ప్రజలకు తెలుసు. జాతీయ వాదం విషయంలో నా ప్రవర్తనపై 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తీర్పునిస్తారు. ఈ విషయంలో ఇంతకు మించి నేను ఏం చెప్పాలనుకోవట్లేదు'' అని అన్నారు. మరోవైపు ఈ కేసులో భాజపా ఎంపీ ప్రతాప్ సింహా వాదనను పోలీసులు రికార్డు చేశారని పార్లమెంట్ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం వెల్లడించారు. డిసెంబరు 13న ఇద్దరు ఆగంతకులు లోక్‌సభ గ్యాలరీ నుంచి వెల్‌లోకి దూకి పొగ బాంబులను విడుదల చేశారు. ఆ ఇద్దరు భాజపా ఎంపీ ప్రతాప్ సింహా పేరుతో జారీ చేసిన పాసులతోనే సభలోకి ప్రవేశించినట్లు గుర్తించారు. దీంతో ఆయన్ను విచారించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో దాడి జరిగిన రోజే ఆయన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి తన వాదనను వినిపించారు. దర్యాప్తు బృందానికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో పార్లమెంటులోకి ప్రవేశించిన మనోరంజన్ డి, సాగర్ శర్మలతోపాటు వెలుపల అలజడి సృష్టించేందుకు ప్రయత్నించిన అమోల్ ధన్‌రాజ్ శిందే, నీలమ్‌దేవిలను పటియాలా హౌస్ కోర్టు జనవరి 5 వరకు పోలీసుల కస్టడీ విధించింది. ఈ ఘటనకు ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న లలిత్ ఝా ధ్వంసం చేసిన ఆధారాలను పోలీసులు గుర్తించారు.

# గత ప్రభుత్వం రెవెన్యూ చట్టాలను ఇష్టానుసారంగా చేసింది

- భూమిని చాపలాగా చుట్టి సంకలో పెట్టుకుపోవాలని ఆశ పడ్డారు
- ప్రభుత్వం తరపున ఒక కమిటీ వేసి సూచనలు చేద్దాం
- ప్రొఫెసర్ కోదండరాం

**విశాలభారతి,హైదరాబాద్:**



గత ప్రభుత్వంలో రెవెన్యూ చట్టాలను ఇష్టానుసారంగా తయారు చేశారని ప్రొఫెసర్ కోదండరాం మండిపడ్డారు. గత పాలకులు భూమిని చాపలాగా చుట్టి సంకలో పెట్టుకుపోవాలని చూశారని ఆరోపించారు. ప్రజలందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలంటే యంత్రాంగం గ్రామ స్థాయి వరకు విస్తరించాలని ఆయన స్పష్టం చేశారు. బేగంపేటలోని హరితప్లాజాలో జరిగిన రెవెన్యూ వ్యవస్థ బలోపేతంపై తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. భూసమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం తరపున ఒక కమిటీ వేసి సూచనలు చేద్దామని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గత ప్రభుత్వం హయాంలో భూరికార్డులను ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. తప్పులను వారికి అనుకూలంగా ఎలా వినియోగించుకున్నారో ప్రజలకు తెలియజెప్పాలని సూచించారు. మార్పులు సంస్కరణల కోసం రెవెన్యూ సిబ్బంది సంఘటితంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అధికారం అందరికీ మేలు చేయాలని, అంతేగానీ ఒకరిద్దరుకు కాదని ధ్వజమెత్తారు. ప్రజలకు మేలు చేసేది వ్యవస్థకు మేలు చేస్తోందని, పాలకులకు మేలు చేసేది అధికారులకు నష్టం చేకూరుస్తుందని ఆచార్య కోదండరాం హితవు పలికారు. "రికార్డులు లేకుండా వాటన్నింటినీ ధ్వంసం చేశారు. తమకు కావాల్సిన రీతిలో భూముల రికార్డులను సరిచేసుకోవడం మొదలు పెట్టారు. ఇది మనం మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఎట్లా దుర్వినియోగం చేశారో మనం చెప్పాలి. వాళ్ల తప్పులకు మనం ఎందుకు శిక్ష వేసుకోవాలి. వాటన్నింటినీ చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది." కోదండరాం, ప్రొఫెసర్ గత ప్రభుత్వం కలెక్టర్లను రియల్ ఎస్టేట్ ఏజెంట్లుగా కన్వర్టు చేశారని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ తీవ్ర ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వం రెవన్యూ వ్యవస్థను ఉద్దేశ్యపూర్వకంగా ధ్వంసం చేసిందని విమర్శించారు. కేసీఆర్ రాజకీయాన్ని వ్యాపారంలాగా విస్తరించారని ధ్వజమెత్తారు.

**భూ యజమాని గ్రామం విడిచి వెళ్లవద్దు**

అవినీతి నిర్మూలన చేయాలంటే ఏంచేయాలో ఆలోచన చేయాలని ఆకునూరి మురళి రెవెన్యూ అధికారులకు సూచించారు. గ్రామంలో ఉన్న భూ యజమాని గ్రామాన్ని విడిచి వెళ్లకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క అధికారి నా తెలంగాణ ప్రజలు, నా మండల ప్రజలు, నా గ్రామ ప్రజలు అని అనుకుంటే ఎటువంటి ఇబ్బందులు తలెత్తవన్నారు.

# రెజ్లింగ్ సమాఖ్య రద్దును ఆహ్వానిస్తున్నా

**ఎమ్మెల్సీ కవిత ట్వీట్**

**విశాలభారతి, హైదరాబాద్:**

కొత్తగా ఎన్నికైన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని ఆహ్వానిస్తున్నానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. మన రెజ్లర్లు దేశానికి ఎంతో గర్వ కారణంగా నిలిచారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. వాళ్లను చూసి ఎంతోమంది మహిళలు భారత్ తరపున ప్రపంచ వేదికపై నిలవాలని కలలు కంటున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి న్యాయ, పారదర్శక వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం భారత రెజ్లింగ్ బలోపేతానికి ఒక మార్గంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.



# చలసాని ఫౌండేషన్ సేవలు హర్షణీయం

**కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి**



**సూర్యాపేట, విశాలభారతి:** యువత విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి దోహదపడతాయని ఎఐసిసి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి అన్నారు. చలసాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం హర్షణీయమని అన్నారు. సూర్యాపేట పట్టణంలోని పాత ఎస్పీ కార్యాలయం వద్ద చలసాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ను ఆదివారం ప్రముఖ పాత్రికేయులు, టియు డబ్ల్యుజే జెఏజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి సూర్యాపేట పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎన్ ఆర్ ఐ చలసాని రాజీవ్ కు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా మద్దతుగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఎందరో ఎన్.ఆర్.ఐ లు ఉన్నప్పటికీ చలసాని రాజీవ్ తను పుట్టిన, పెరిగిన ప్రాంతంలో ని అసహాయులను, నిరుపేదలను ఆదుకొని వారికి ఎల్లవేళలా అండగా నిలవడం నిజంగా ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమని చలసాని ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగానే సూర్యాపేట నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటామని అన్నారు. చలసాని ఫౌండేషన్ చైర్మన్ ఎన్ఆర్ఐ చలసాని రాజీవ్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామని, ఆపదలో ఉన్న పేదవారిని ఆదుకోవడం జరుగుతుందని, తమకు సహకరిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు పట్టణాల్లో పర్యటిస్తూ ఆపదలో ఉన్న వారి వివరాలు సేకరిస్తూ తక్షణ సహాయం చేస్తున్నామని ఆపదలో ఉన్నవారు చలసాని ఫౌండేషన్ ను సంప్రదించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, నాయకులు శనగాని రాంబాబు గౌడ్, రెబల్ శ్రీను, గవ్వ క్రష్ణారెడ్డి, జైపాల్ రెడ్డి, చలసాని ఫౌండేషన్ సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.



## క్రీడలు మానసిక స్తైర్యాన్ని పెంచుతాయి

- **క్రీడా పరిశోధన కేంద్రంగా వందేమాతరం ఫౌండేషన్**
- **కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ ఎడ్మ సత్యం**

**కల్వకుర్తి, విశాల భారతి:** క్రీడల వల్ల మానసిక ధైర్యం పెంపొందించడంతోపాటు శారీరక ఆరోగ్యం స్నేహ భావం కలుగుతాయని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తాసిల్దార్ చంద్రశేఖర్ అన్నారు. రానున్న రోజుల్లో కల్వకుర్తి వందేమాతరం ఫౌండేషన్ క్రీడా పరిశోధన కేంద్రంగా విరజిల్లనుందని తెలిపారు. శనివారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని వందేమాతరం ఫౌండేషన్ లో ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ ని వారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టోర్నమెంట్లో 70 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. క్రీడలు మనిషిలోని శక్తిని కొత్త పుంతలు తొక్కించడానికి తోడ్పాటును అందిస్తాయని అన్నారు.

**క్రీడలకు ప్రోత్సహం అందిస్తాం:**

క్రమ శిక్షణతో సాధన చేస్తే ఆటలో మంచి ప్రావీణ్యం సాధించవచ్చని ఎస్బిఐ జోగులాంబ రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ అమర్ బాబు, చీఫ్ మేనేజర్ జితేంద్ర కుమార్ అరుణ్ లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, దేశ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని వారన్నారు. గ్రామీణ క్రీడలకు, క్రీడాకారులకు తాము ఎల్లవేళలా ప్రోత్సహం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో వందేమాతరం షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు శశాంక్ రెడ్డి, విరెడ్డి మాధవ రెడ్డి, కల్వకుర్తి ఎస్బిఐ మేనేజర్ జితేందర్, వెల్దండ మేనేజర్ శ్రీధర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

- **ఘనంగా సిపిఐ 99వ వార్షికోత్సవం**
- **రాష్ట్ర కార్యదర్శి సభ్యులు తక్కలపల్లి శ్రీనివాస్ రావు**

**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండల కేంద్రంలోని ముల్కనూర్ అమరవీరుల స్తూపం వద్ద 99వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కలపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. అనంతరం సిపిఐ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి ఘనంగా వేడుక జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సభ్యులు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26వ తేదీన అనేక నిర్బంధాల మధ్య ఆవిర్భవించిన పార్టీ సిపిఐ అని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 99 సంవత్సరాల సందర్భంగా ప్రజా సమస్యల నిత్యం పోరాడేది పేద ప్రజల పక్షాన ఉండి పోరాటం చేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని.. దేశంలో జరుగుతున్న కులమత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కేంద్రంలో అధికార పార్టీ నల్ల డబ్బులు ఇస్తానని ప్రతి కుటుంబానికి 15 లక్షలు ఇస్తామని ప్రగల్బాల్ పలికి ఆదోని అంబానీ లాంటి పెత్తందార్ల చేతులోకి దేశాన్ని తాకట్టు పెట్టే పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 26వ తేదీ మంగళవారం హన్మకొండలో జరిగనున్న సిపిఐ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొంగల రామచంద్రారెడ్డి, మంచాల తిరుపతి, మార్పు కృష్ణారెడ్డి, రమేష్, రావుల తిరుపతి, బోడ బాలరాజు, చుంచు కుమారస్వామి, ఉపేందర్, రవి, సరిత తదితరులు పాల్గొన్నారు.



## వాహనం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

**కోదాడ, విశాల భారతి:** పట్టణానికి చెందిన పగిడిమర్రి మదన్ మోహన్ నూతనంగా కొనుగోలు చేసిన టాటా హిటాచి ప్రోక్లెన్ ను వారి కోరిక మేరకు కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రామినేని శ్రీనివాసరావు తో కలిసి శ్రీరంగాపురం అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇటువంటి భారీ ప్రోక్లైన్లు అవసరం ఉంటే ఇతర నగరాల నుండి ఎంతో శ్రమకోర్చి, ఖర్చు చేసి తెప్పించేవారని అన్నారు. కోదాడ పట్టణం దినదినాభివృద్ధి చెందుతున్న సందర్భంగా భారీ ప్రోక్లైన్లు కొనుగోలు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన మదన్ మోహన్ ను వారు అభినందించారు. ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా ఉండే ధరలు నిర్ణయించి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మహబూబ్ జానీ, గద్దె నరేందర్, దండా వీరభద్రం, తీగల నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ముస్తాబైన చర్చీలు

**కోదాడ, విశాల భారతి:** క్రిస్మస్ పండుగ సందర్భంగా కోదాడ పట్టణంలోని పలు ప్రార్థన మందిరాలు నూతన శోభను సంతరించుకున్నాయి. కోదాడ పట్టణంలోని నయా నగర్ లోని బాప్టిస్ట్ చర్చి, సిసి రెడ్డి స్కూల్ ప్రక్కనగల ఆర్ సి ఎం చర్చిలతో పాటు పట్టణంలోని పలు చర్చిలు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. చర్చి ఆవరణాలు మొత్తం రకరకాల విద్యుత్ కాంతులతో విరజుమ్మితున్నాయి. నేటి అర్ధ రాత్రి నుంచి వేడుకలు ప్రారంభం కావడంతో ప్రార్థన మందిరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.



## పబ్లిక్ క్లబ్ ను రాజకీయ సంస్థగా మార్చారు

- **గతంలో ఏనాడు కూడా పబ్లిక్ క్లబ్ డైరీలలో రాజకీయ నాయకులు ఫోటోలు లేవు**

**సూర్యాపేట, విశాలభారతి:** పబ్లిక్ క్లబ్ ను రాజకీయ సంస్థగా మార్చింది బిఆర్ఎస్ పార్టీయేనని, గతంలో ఏనాడు కూడా పబ్లిక్ క్లబ్ డైరీలలో రాజకీయ నాయకులు ఫోటోలు లేవని, గత ఆరేళ్లలో క్లబ్ ను పంచాయతీలు, సెటిల్మెంట్ చేయడానికి వాడుకున్నారని బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే క్లబ్ ఎన్నికలకు పోలీసులను పెట్టారనిపబ్లిక్ క్లబ్ 1964లో ఏర్పాటు నుంచి కార్యాలయం ఆడిటోరియం ఏర్పాటు చేశారని పబ్లిక్ క్లబ్ సీనియర్ సభ్యులు, అడ్వకేట్ నూకల సుదర్శన్ రెడ్డి, శనగాని రాంబాబు, బైరు శైలేందర్, ఫరీద్, అబ్దుల్ రహీంలు అన్నారు. ఆదివారం పబ్లిక్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కట్కూరు గన్నారెడ్డి, కొప్పుల వేణారెడ్డి సెక్రటరీలుగా పనిచేసిన సమయంలో క్లబ్ ఆవరణలో దుకాణాల సముదాయం, జిమ్ సెంటర్ ఏర్పాటు చేశారని, 40 లక్షల వ్యయంతో ఆధునిక ఇండోర్ ఉడెన్ షటిల్ కోర్ట్ చేశారని చెప్పారు. 2017 సంవత్సరం నుంచి 2023 వరకు క్లబ్ వ్యవహారాలలో అప్పటి అధికార పార్టీ నాయకుల జోక్యం పెరిగిందని, క్లబ్ లో పంచాయతిలు, సెటిల్ మెంట్ లు చేయడం మొదలైందని, క్లబ్ లో ఎసి రూంలో సభ్యులకు ప్రవేశం లేకుండా చెశారని అన్నారు. మీ పాలనలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2022 సంవత్సరంలో పోలీసులతో నిర్బంధం చేసి కార్యదర్శిని కమిటీని ఎన్నుకున్నారని, గతంలో క్లబ్బుకు ఎప్పుడైనా పోలీసులు వచ్చారా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పిండగ విజయ్, అంజద్ ఆలి, ఎల్గూరి చంటిబాబు, గవ్వ కృష్ణారెడ్డి, కమ్రుద్దిన్, కుమ్మరికుంట్ల లింగయ్య, నాగుల వాసు, కుందమళ్ల శేఖర్, రాపర్తి శ్రీనివాస్, రుద్రంగి రవి తదితరులు పాల్గొన్నారు.



## భూ సమస్య వీడి... ఆహ్లాదంగా మారి

**కాలనీ వాసుల పోరాటం.. ఫలించిన ఆరెండ్ల కష్టం**

**కల్వకుర్తి, విశాల భారతి:** ఆమనగల్లు పట్టణ కేంద్రంలో నిషేధిత జాబితాలో ఉన్న 1457, 1459 సర్వే నెంబర్లలో క్రయవిక్రయాలు, ఇంటి నిర్మాణాలకు గత నెలలో ప్రభుత్వం నుండి అనుమతి లభించింది. దీంతో విద్యానగర్ కాలనీ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు.

**నెరవేరిన ఆరేళ్ల పోరాటం:**

30 ఏళ్ల క్రితం ఆమనగల్లు పట్టణంలోని 1457, 1459 సర్వే నెంబర్లలో వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించారు. ప్లాట్లను విక్రయించిన సుమారు 200 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నారు. కానీ 2017లో 1457, 1459 సర్వే నెంబర్ల స్థలాలు దేవాదాయక శాఖకు చెందినవని ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ సర్వే నెంబర్లలో ఇళ్ల నిర్మాణాలకు మున్సిపాలిటీ అనుమతి నిలిపివేసింది. అప్పటినుండి కాలనీవాసులందరూ సమన్వయంతో కమిటీని ఏర్పాటు అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగి అనేకసార్లు తమ సమస్యను వెళ్లబుచ్చుకున్నారు. దీంతో గత నెల క్రితం ఆ సర్వే నెంబర్లలో ఇండ్ల నిర్మాణానికి అనుమతి ఇస్తూ దేవాదాయ శాఖ అనుమతి ఇవ్వడంతో తమ ఆరేళ్ల కష్టానికి ప్రతిఫలం లభించిందని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పాషా తెలిపారు.



## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్

**దేవరుప్పుల, విశాలభారతి** మండలంలోని ధరావత్ తండా గ్రామం, చింతబాయి తండాలో కునుసోతు మధుకర్‌మంజుల, లక్ష్మణ్‌సుజాతల ఇల్లు నిన్న రాత్రి గ్యాస్ లీకేజితో దగ్ధమైన సంగతి అందరికి తెలిసిందే. అందులో భాగంగానే పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు వారి దగ్గరకు వెళ్ళి నిత్యావసర సరుకులను సీతారాంపురం గ్రామ సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్ పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ నిమ్మల గణేష్, ఆలకుంట్ల ప్రవీణ్, చింత శ్రీకాంత్, ధారవత్ తండా గ్రామ శాఖ అధ్యక్షుడు ధరావత్ రవిందర్, యూత్ అధ్యక్షుడు కిరణ్, సావిత్రి, కీమా నాయక్, దేవనాయక్, తుక్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.





## రాఘవేంద్ర ల్యాబ్ సేవలు అభినందనీయం

**మెడికల్, డ్రగిస్ట్ అసోసియేషన్ నాయకులు గుండా శ్రీనివాస్ గుప్తా**

**సూర్యాపేట, విశాలభారతి:** కరోనా సమయంలో రాఘవేంద్ర ల్యాబ్ సమాజానికి చేసిన సేవలు అభినందనీ యమని సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు, మెడికల్, డ్రగిస్ట్ అసోసియేషన్ నాయకులు గుండా శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నాయకులు, డాక్టర్ కల్లేపల్లి నరేష్ నిర్వహిస్తున్న రాఘవేంద్ర ల్యాబ్ పదో వార్షికోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి సంభ రాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుండా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ డాక్టర్ కల్లేపల్లి నరేష్ వ్యాపార రంగంలో రాణిస్తూనే.. కరోనా సమయంలో ఎంతోమందికి సేవలు అందించాడని కొని యాడారు. పేద ప్రజలకు అతి తక్కువ ఖర్చుతోని వైద్య సేవ అందిస్తూ మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. మునుముందు ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి మన్నన్నలు పొందాలని ఆకాశించారు. ఈ కార్యక్రమంలో కొచ్చెర్ల మధు అనంతుల వంశీ ,వేముల శ్రీనివాస్, సరిత, శేఖర్,రువ్వ వినోద్,నకేరేకంటి నాగరాజు , సందీప్,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సమేలు చరిత్రలో నిలిచిపోతాడు

- **మరో గుమ్మడి నర్సయ్య, బిఎన్ రెడ్డి లాంటి వ్యక్తిత్వం కలిగిన వారు**
- **యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కట్ల సైదులు గౌడ్**



**సూర్యాపేట, విశాలభారతి:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ను చూస్తుంటే ఈ కాలంలో ఇంత నీతిగా నిజాయితీగా ఉంటున్న మరో గుమ్మడి నర్సయ్య, బిఎన్ రెడ్డి లాంటి వారు గుర్తొస్తున్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కట్ల సైదులు గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ పోరాటాల గడ్డ తుంగతుర్తి నియోజకవర్గంలో గత 25, సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేసిన బిడ్డగా తుంగతుర్తి చరిత్రలో నిలిచిపోవడం ఖాయం అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం సామెల్ ను గుర్తించకున్న కాంగ్రెస్ పార్టీ గుర్తుంచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి గౌరవించింది అన్నారు. తుంగతూర్తి నియోజకవర్గ ప్రజలు డబ్బు, మద్యానికి అమ్ముడు పోకుండా నికార్సయిన ఉద్యమ నాయకుడికి పట్టం కట్టారన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే మందుల సామేలు నాయకత్వంలో తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇంత భారీ ఎత్తున విజయం అందించిన తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. ఆయన వెంట గ్రామ శాఖ అధ్యక్షులు బండగొర్ల కుమారస్వామి,ఎంపీటీసీ బండగొర్ల నరేష్, మాజీ సర్పంచ్ ఆనందుల రేణుక,పల్సం సైదులు, పోగుల వెంకటనారాయణ ఉన్నారు.



## బాధిత కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సాయం

**కల్వకుర్తి, విశాలభారతి:** ఇటీవలే మార్చాలా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కల్వకుర్తి పట్టణానికి చెందిన నవాజ్ కుటుంబాన్ని ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించారు. అధైర్య పడకుండా గుండె నిబ్బరంగా ఉండాలని ఆయన సూచించారు. అదేవిధంగా బాధ్యత కుటుంబ సభ్యులకు రూ.35 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట వైస్ చైర్మన్ షాహిద్, మాజీ చైర్మన్ రాయచోటి శ్రీశైలం, కౌన్సిలర్లు భోజి రెడ్డి, సూర్య ప్రకాశరావు, సైదులు గౌడ్, నాయకులు తాహిర్ అలీ, కో ఆప్షన్ ఖలీల్, చెన్న కేశవులు, సయ్యద్ ముజ్జు, ఖాదర్, మైనార్టీ సెల్ అబ్దుల్ ఖాదర్, అన్వర్, ముక్రం ఖాన్, హాసన్, అహ్మద్, షన్న తదితరులు fఉన్నారు.



## తలనీలాలు అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

**దేవరుప్పుల, విశాలభారతి:** మండలంలోని గొల్లపల్లి గ్రామంలో మామిడాల యశస్విని రెడ్డి గెలుపును కోరుతూ గత నెలలో ఎర్రవరం బాల ఉగ్ర నరసింహ స్వామికి తలనీలాలు మొక్కుకున్నారు. అందులో భాగంగానే భారీ మెజారిటీతో యశస్విని రెడ్డి గెలుపొందగా ఇచ్చిన మాట ప్రకారమే ఈ రోజు ఉగ్ర నరసింహస్వామికి మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గొల్లపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు మరియు ముఖ్య కార్యకర్తలతో కలిసి ఎర్రవరం బాల ఉగ్ర నరసింహ స్వామికి మొక్కు తీర్చుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు తీగల వెంకన్న, ఉప సర్పంచ్ తీగల యాకన్న, తీగల లక్ష్మయ్య, బట్ట యాదగిరి, దయ్యాల వెంకటేష్, బట్ట ప్రకాష్, దూదిమెట్ల బయ్యాలు, జక్కి కొండయ్య, బట్ట సోమయ్య, కోఆర్డినేటర్ కదారి అంజయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## శేఖర్ ని పరామర్శించిన దైద

**నకిరేకల్, విశాలభారతి:** మర్రుర్ గ్రామం చెందిన గ్రామ కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ శేఖర్ గౌడ్ ఆరోగ్యం బాలేకపోవడంతో విషయం తెలుసుకున్న దైవ సుందరయ్య ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ శేఖర్ ఇంటికి వెల్లి పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. దైర్యంగా అండమని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దైద వెంటకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి యూసుఫ్, గాదే చంద్రయ్య, చనగని రాజశేఖర్, వంటేపాక సతీష్, తదితరులున్నారు.

# పాస్టర్లకు గుడ్ న్యూస్ చెప్పిన ఎంపీపీ

**మునగాల ఎంపిపి ఎలక బిందు నరేందర్ రెడ్డి**



**మునగాల, విశాల భారతి:** క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మునగాల ఎంపిపి ఎలక బిందు నరేందర్ రెడ్డి అన్నారు. మునగాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో శనివారం రాత్రి మునగాల, నడిగూడెం, మోతే మండలాల క్రైస్తవ సోదర సోదరీమణులకు ఏర్పాటు చేసిన క్రైస్తవులకు బట్టల పంపిణీ, క్రిస్మస్ విందు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీల హామీలకు కట్టుబడి ఉందని ఆమె తెలిపారు. అంతేకాకుండా క్రిస్టియన్ పాస్టర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే నెలకు పదివేల రూపాయల పారితోషికాన్ని అందజేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీలను ఎంతో అభివృద్ధి చేసిందని, అందులోనే భాగంగా పేద క్రైస్తవులకు బట్టల పంపిణీ, క్రిస్మస్ విందులాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. అనంతరం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ ఎస్సీలుగా ఉన్నవారు తమ ఇష్ట ప్రకారం బిసిసి సర్టిఫికెట్ తీసుకోవడానికి ముందుకు వస్తే వారికి తప్పకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. సూర్యపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ యూత్ కన్వీనర్, సిసిఓసి మూడు మండలాల కన్వీనర్ పాస్టర్ జె జె సామ్యూల్ సన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో మునగాల వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, కాసర్ల శ్రీనివాస్, మునగాల గ్రామ సర్పంచ్ చింతకాయల ఉపేందర్, క్రైస్తవులు పాల్గొన్నారు.

- పేపర్లకె పరిమితమైన 1/70 చట్టం
- గిరిజనులనె బెదిరిస్తున్న సంపన్న వర్గాల



**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం పట్టణం వివిధ కాలనీలో ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొంతమంది గిరిజ నేతరులు ఆదివాసి భూములను కబ్జా చేసారని మహాజన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణంలోని వివిధ కాలనీలో ఉన్న భూములను సంపన్న వర్గాల గిరిజనేతరులు ఆక్రమించి క్రయ విక్రయాలు చేస్తున్నారని అధికారులు స్పందించి అటువంటి వారిపైన తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు ఆదివాసీల పట్టా భూములను కూడా కారు చౌకుగా కొనుక్కొని లక్షల రూపాయలుకు అమ్ముకుంటున్నారని ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొన్ని కాలనీలలో వారి భూములను తక్కువగా కొని ఎక్కువ రేట్లకు అమ్ముకొని కోట్లకు పడిగెత్తుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 1/70 ఉన్న కూడా భూ క్రయ విక్రయాలు చేస్తున్నారని బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని ఆమె అన్నారు. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో ఆదివాసి పట్టా భూములను కూడా కబ్జా చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శ్రీనివాస్ నగర్ లో భారీ చోరీ

**15 తులాల గోల్డ్, లక్ష నగదు అపహరణ**



**మిర్యాలగూడ, విశాలభారతి:** రెండు పల్సర్ బైక్ ల పై వచ్చిన ఓ ముగ్గురు గుర్తు తెలియని దొంగలు ఓ ఇంటి గేటు దూకి డోర్లు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి భారీగా గోల్డ్, లక్ష నగదు అపహరించిన సంఘటన నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాస్ నగర్ కు చెందిన చిలుకూరి వెంకటేశ్వరరావు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా హైదరాబాద్ కు వారం క్రితమే వెళ్లారు. వారి కుమారుడి వైద్యం నిమిత్తం అక్కడే ఉన్నారు. గేటు కు తాళం వేసి ఉండగా డోర్ తెరిచి ఉన్న విషయాన్ని ఇంటి ఎదురుగా ఉన్న వారి నుంచి ఆదివారం ఉదయం సమాచారం అందుకున్న ..వెంకటేశ్వరరావు దంపతులు మిర్యాలగూడకు చేరుకొని ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డ పారతో డోర్ల ను ధ్వంసం చేసి ఇంట్లో బెడ్ రూమ్ లోకి వెళ్లి కప్ బోర్డ్స్, బీరువా పగలగొట్టి అందులో సుమారు 15 తులాల బంగారం, లక్ష నగదు అపహరించినట్లు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నర్సింహులు వివరాలు సేకరించారు.

## కళాకారులకు స్ఫూర్తి శిఖరం అవార్డులు



**కోదాడ, విశాల భారతి:** కళాకారులు లఘు చిత్ర నిర్మాత తిరుప్ ఏర్పుల, రచయిత సరికొండ నరసింహారాజులకు స్ఫూర్తి శిఖరం అవార్డులు వరించాయి. ఆదివారం కరీంనగర్ లోని ఫిలిం భవన్ లో ఆర్యాని సంస్థ నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో జాతీయ స్థాయి రచయితల సంఘం అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్, ఆర్యానీ సంస్థ చైర్మన్ దూడపాక శ్రీధర్, ప్రముఖ గాయకులు సుబ్రహ్మణ్య దీక్షితులు చేతుల మీదుగా అవార్డు, ప్రశంస పత్రం అందుకున్నారు. కోదాడలో ఎంతోమంది కళాకారులను ప్రోత్సహిస్తూ, లఘు చిత్రాలు నిర్మిస్తూ, కళా రంగానికి తిరుప్ ఏర్పుల చేస్తున్న సేవలకు గాను, తన రచనలతో సినీ రంగంతో పాటు సమాజాన్ని చైతన్యపరిచే విధంగా రచయిత సరికొండ నరసింహారాజు లు ఇరువురు సినీ రంగానికి చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువా, పూల బొకేతో ఘనంగా సన్మానించారు.



# కూకట్పల్లి కాంగ్రెస్ నాయకుల్లో ఐక్యత

- బండి రమేష్ కు పెరుగుతున్న ఆదరణ
- ఏకతాటి పైకి వస్తున్న సీనియర్ నేతలు

**విశాలభారతి,కూకట్ పల్లి:** కూకట్ పల్లి లో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం రాబోతుందా..అంటే అవునని సమాధానం చెప్పాలి..ఎన్నికల ముందు నెల రోజుల వ్యవధి ఉండడంతో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బండి రమేష్ నేరుగా ఎన్నికల పోటీ లోకి దిగారు అప్పటికి ఆయనకి కూకట్పల్లి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దగా ఎవరు పరిచయం లేదు, అయినప్పటికీ ఆయన ధైర్యంతో ముందువెళ్లి ఎన్నికల్లో పోటీ చేశారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు సీనియర్ నేతలు ఎవరో తెలియని పరిస్థితి.ఈ సందర్భంలో కొంతమంది నేతలని కలుపుకొని ముందుకు వెళ్లారు. అయినప్పటికీ, సమయభావం తో కొద్ది మండినే కలిశారు మరికొద్ది మంది నాయకులను కలుసుకోలేదు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బండి రమేష్ ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ చెలించకుండా.. పార్టీ ఆదేశాల మేరకు ఇన్చార్జి పదవిని తీసుకొని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నారు. త్వరలోనే పార్లమెంటు ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా నియోజకవర్గంలో కాంగ్రెస్ సీనియర్లను కలుపుకొని ముందుకు వెళ్తున్నారు. రోజురోజుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజల నుండి ఆధరాభిమానాలు పెరుగుతూ వస్తున్నాయి. ఇంతకాలం కామ్ గా ఉన్నా బాలనగర్ చెందిన మాజీ పిసిసి కార్యదర్శి సింగజోగి కృష్ణ, కూకట్పల్లి నియోజకవర్గం మాజీ ఇన్చార్జి శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్పల్లి నుండి తన కార్యకర్తలతో భారీగా మియాపూర్ పార్టీ కార్యాలయానికి తరలివచ్చి బండి రమేష్ నాయకత్వాన్ని బలపరుస్తూ ఆయనకు మద్దతు తెలిరు, కూకట్ పల్లి ఇంచార్జ్ గా బాధ్యతలు చేపట్టిన బండిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి నాయకుడు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషిచేసి మల్కాజిగిరి,మేడ్చల్ పార్లమెంటు నియోజకవర్గం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరోసారి విజయం చేకూర్చి గిఫ్ట్ గా ఇవ్వాలని కార్యకర్తలకు నాయకులకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందే విధంగా ప్రతి కార్యకర్త శ్రమించి పని చేయవలసి ఉంటుందని తెలియపరిచారు.ఈ కార్యక్రమం లో కొప్పు శెట్టి దినేష్ , గంట శ్రీనివాస్ గౌడ్, రమేష్, రాజేష్ గౌడ్, స్వరూప,దేవి,రాజేశ్వరి ,రాణి నిర్మల, కిరణ్, యోగి, ప్రణవ్, గిరి భగీరథ, కార్తీక్, వంశీ, సుహార్ష, కార్తీక్ గౌడ్ తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు



# చర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే

**మహబూబాబాద్, విశాల భారతి:** బయ్యారం మండలంలోని నర్స తండ గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన చర్చిని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ పేద ప్రజలకు బట్టల పంపిణీతో పాటు క్రిస్మస్ సోదరులకి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందని వారు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా క్రిస్మస్ మైనార్టీ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బయ్యారం మండల అధ్యక్షులు ముసలయ్య, బయ్యారం చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, నర్స తండ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోతు రాజు నాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు

**తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్**



**సూర్యాపేట, విశాలభారతి:** క్రైస్తవ సోదరులు అందరూ సంతోషంతో క్రిస్మస్ పండుగ నిర్వహించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పంతంగి వీర స్వామి గౌడ్ ఆకాంక్షించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. క్రీస్తు పుట్టిన రోజున క్రైస్తవ సోదరులు అత్యంత ఘనంగా క్రిస్మస్ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనీ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఏసుక్రీస్తుకు ప్రార్థనలు చేయాలని క్రైస్తవులను కోరారు.

# మరిపెడ ఎస్సైగా జీనత్



**మరిపెడ, విశాల భారతి:** మరిపెడ నూతన ఎస్సైగా నిమ్మ తోట జీనత్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మరిపెడ పోలీస్ స్టేషన్ నందు ఎస్సై 1 గా విధులు నిర్వహించిన దూలం పవన్ బదిలీపై వెళ్లారు. మరిపెడ 2 ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జీనత్ ఆదివారం మరిపెడ వన్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.



# సమస్యలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం

**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు విస్తృత పర్యటన నిర్వహించారు. వాజేదు వెంకటాపురం చర్ల దుమ్ముగూడెం భద్రాచలంఆయా ప్రాంతాల్లో నెలకొన్ని ఉన్న వివిధ సమస్యల పైన సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ గ్రామాలలో ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ప్రజలు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆయన అన్నారు. ఆ సమస్యల పైన అధికారుల దృష్టికి తీసుకువెళ్లిసమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటానని. అధికారుల పరిధిలో ఉన్న సమస్యలు తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతానని ఆయన తెలిపారు. ప్రభుత్వం నుండి నిధులు మంజూరుఅయ్యే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన నిధులను రాబట్టే విషయంలో రాజీ పడనని నా మీద నమ్మకంతో గెలిపించిన ప్రజలకు అండదండగా ఉంటానని ఆయన అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## సీతక్కకు శుభాకాంక్షలు తెలిపిన కర్క నాగరాజు

**కూకట్ పల్లి,విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాద్ అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం అధ్యక్షులు ఏ.ఐ.ఏ.వై.యెస్ కర్క నాగరాజు ఆధ్వర్యంలో ఇటీవల తెలంగాణ రాష్ట్రానికి పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ మరియు ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సీతక్క ని న్యూ ఏమ్మెల్యే క్వార్ట్రస్ వారి నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పూల భోకేతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో గ్రేటర్ హైదరాబాద్ అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం నాయకులు జక్కుల అశోక్, శ్రీనివాస్, సదామహేష్,ఫయాస్,గుండె శివరాజు తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే లాస్యనందితకు తప్పిన పెనుప్రమాదం

**20నిమిశాలపాటు లిఫ్ట్ లోనే, డోర్ బద్దలు కొట్టగా ప్రాణాలతో బయటకి**

**విశాల భారతి,కంటోన్మెంట్:** తృటి లో పెను ప్రమాదం తప్పింది.కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత తో పాటు పలువురు ప్రయివేట్ హాస్పిటల్ వార్షికోత్సవ కార్యక్రమం లో పాల్గొనేందుకు వెళ్లిన వారికీ చెడు అనుభవం ఎదురైంది.మూడో ఫ్లోర్ కు వెళ్లేందుకు లిఫ్ట్ లో వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే తో పాటుపలువురు నేతలు పదుల సంఖ్య లో అదే లిఫ్ట్ లోకి చేరారు. లిఫ్ట్ కెపాసిటీ కంటే అధికం కావడంతో మూడో ఫ్లోర్ కి వెళ్లాల్సిన లిఫ్ట్ ఒక్కసారిగా కిందకు పడిపోయింది. సుమారు 15 నిముషాలు లిఫ్ట్ లోనే గడపాల్సి వచ్చింది .ఈ సంఘటన తో అందరు ఉలిక్కిపడ్డారు. లిఫ్ట్ దూరంను తెరిచేందుకు హాస్పిటల్ యాజమాన్యం శ్రమించాల్సి వచ్చింది. పక్కనే వంటి చేసేందుకు వినియోగించిన వస్తువులతో లిఫ్ట్ డోర్ ను బద్దలు కొట్టి ఎమ్మెల్యే లాస్యనందిత తో పాటు అందర్నీ బయటకు తీశారు. దీనితో అందరు ఊపిరి పీల్చుకున్నారు. వార్షికోత్సవం వేడుకల్లో భాగంగా నూతనంగా ఏర్పాటుచేసిన లిఫ్ట్ ను ప్రారంభించిన కొన్ని క్షణాల్లోనే ఇలా జరగడం తో అందరి ముఖాల్లో దిగభ్రాంతి చోటు చేసుకుంది. కానీ ఎవరికి ఎటువంటి హాని జరగలేదు,ప్రాణ నష్టం లేదు.

**వీఆర్ మల్టీస్పెషలిస్ట్ హాస్పిటల్ ఈ హెచ్ ఎస్ సేవలు**

వీ ఆర్ హాస్పిటల్ ఏదో వార్షికోత్సవం సందర్భంగా క్యాష్ లేష్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు హాస్పిటల్ ఎండి నంద కిషోర్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈహెచ్ఎస్, ఇన్సూరెన్స్ ఉన్నవారు నగదు చెల్లించకుండానే వైద సేవలు పొందవచని స్పష్టం చేశారు.త్వరలోనే సీటీ స్కాన్, ఆల్ట్రా సౌండ్ వంటి సేవలను అందుబాటు లోకి తీసుకు వస్తామని వివరించారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ భరత్ కాంత్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, రచన రెడ్డి, బీఆర్ఎస్ నేతలు నివేదిత,మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పత్రికల మేడ్చల్ జిల్లా అధ్యక్షునిగా శ్రావణ్ కుమార్




**కూకట్ పల్లి,విశాలభారతి:** టియుడబ్ల్యూజే H 143 అనుబంధ చిన్న పత్రికల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షునిగా కే శ్రావణ్ కుమార్ నియామకం అయ్యారు. రాష్ట్ర కార్యాలయంలో చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిజిగిరి శ్రీనివాస్ ఈ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో స్థానిక పత్రికలు కీలక భూమిక వహించాయని తెలంగాణ రాష్ట్రంలో చిన్న పత్రికల అభివృద్ధి పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన అన్నారు. చిన్న పత్రికల అభివృద్ధి కొరకు నా శక్తి మేరకు కృషి చేస్తానని శ్రావణ్ కుమార్ తెలిపారు. అలాగే డియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ నాయకత్వంలో జర్నలిస్టుల సమస్యల పట్ల పోరాట మార్గంలో పని చేస్తామని ఆయన అన్నారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు బిజిగిరి శ్రీనివాస్ కు రాష్ట్ర కార్యవర్గానికి శ్రావణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



# ఎమ్మెల్యేకు సన్మానం

**చిట్యాల, విశాలభారతి:** చిట్యాల గౌడ సంక్షేమ సంఘం నాయకులు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. చిట్యాల గౌడ సంక్షేమ సంఘ అభివృద్ధికి సహరించాలని, కంఠమహేశ్వర స్వామి గుడి యొక్క ప్రహరీ గోడ, అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్, షెడ్ ఇతరత్రా పనులకు ఫండ్ ఇవ్వాలని సంఘ నాయకులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డా.జి.భానుప్రకాష్ రెడ్డికి వేపచేదు స్మారక అవార్డ్



**సికింద్రాబాద్, విశాలభారతి:** ఉస్మానియా విశ్వవిద్యాలయం సైన్సు కళాశాల జీవ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఐసీయంఆర్ ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డా.జి.భానుప్రకాష్ రెడ్డి కి 2023 సంవత్సరం గాను " వేపచేదు గోపాలకిషనరావు స్మారక అవార్డ్ " ను ప్రధానం చేయనున్నట్లు విభాగం ఆచార్య మంజుల భానూరి ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ అవార్డ్ ప్రతి సంవత్సరం జీవ రసాయన శాస్త్ర విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రదానం చేస్తుందన్నారు.దానిలో భాగంగానే డిసెంబర్ 28న,విభాగం ఈ అవార్డ్ ప్రదానోత్సవం జరుగుతుందని ఆచార్య మంజుల భానూరి చెప్పారు. ప్రతి సంవత్సరం సైన్సు రంగాల్లో సేవలు అందించిన వారికి ఈ అవార్డ్ ఇస్తున్నట్లు చెప్పారు. ఇక డా.భానుప్రకాష్ రెడ్డి ఎన్ఐఎన్ లో సైయింటిస్టు జి గా, బయోకెమిస్ట్రీ డివిజన్ హెడ్ గా పనిచేస్తున్నారు.అయిన గతంలో పలు ప్రతిష్టాత్మక అవార్డ్స్ పొందారు. తెలంగాణ సైన్స్ అకాడమీ లో రాష్ట్రంలో సైన్స్ పురోగతి కి విశేష కృషి చేస్తున్నారు.


విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com

vishalabharathi Telugu Daily



సోమవారం,
25.12. 2023
హైదరాబాద్



# 27న ఈగల్ సెకండ్ సింగిల్ 'గల్లంతే'

మాస్ మహారాజా రవితేజ మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం 2024లో విడుదలవుతున్న భారీ అంచనాలున్న సినిమాల్లో ఒకటి. ఇటీవలే విడుదలైన ఈగల్ ట్రైలర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్ తో సినిమాపై క్రేజ్ నెక్స్ట్ లెవల్ కి చేరింది. 'ఈగల్' ఫస్ట్ సింగిల్ ఊర మాస్ అంథమ్ ఆడు మచ్చా పాట చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఇప్పుడు మేకర్స్ సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. ఈగల్ సెకండ్ సింగిల్ 'గల్లంతే' పాటని డిసెంబర్ 27న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. సాంగ్ పోస్టర్ లో రవితేజ, కావ్య థాపర్ రొమాంటిక్ కెమిస్ట్రీ ఆకట్టుకుంది. ఫస్ట్ సింగిల్ మాస్ సాంగ్ అయితే సెకండ్ సింగిల్ మనసుని హత్తుకునే మెలోడీగా ఉంటుందని అనౌన్స్ మెంట్ పోస్టర్ సూచిస్తోంది.

# ఇంద్రుని పుత్రిక ఇంద్రజ దిగొచ్చింది!

అతిలోక సుందరి శ్రీదేవి ఇంద్రుని కుమార్తె ఇంద్రజగా నటించి కోట్లాది మంది ప్రజల మనసులు గెలుచుకుంది. మెగాస్టార్ 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సినిమాలో ఇంద్రలోకం నుంచి భూలోకానికి దిగి వచ్చే దేవాధిదేవుని పుత్రికగా మైమరిపించే నటనతో ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ సినిమాలో దేవకన్యగా శ్రీదేవిని దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు ఆవిష్కరించిన తీరు మహదాద్భుతం. స్వర్గలోక పాలకుడు ఇంద్రుని కుమార్తె ఇంత అందంగా ఉంటుందా? అనిపించేంతగా శ్రీదేవి రూపం మైమరిపించింది. అయితే ఇప్పుడు శ్రీదేవి నటవారసత్వాన్ని ముందుకు తీసుకెళుతున్న జాన్వీ కపూర్ అందం నటనలో రోజు రోజుకు షైన్ అవుతున్న తీరు ఆకర్షిస్తోంది. జాన్వీ లుక్ కాలంతో పాటు చాలా మారుతోంది. జాన్వీ తాజా ఫోటోషూట్ అందుకు నిదర్శనం. ఒకవేళ ఇంద్రుని పుత్రిక ఇంద్రజగా మళ్లీ ఎవరు నటిస్తే బావుంటుంది? అంటే.. కచ్చితంగా జాన్వీ కపూర్ అయితే బావుంటుందని ప్రశంసించి తీరాలి. అంతందంగా రాకుమార్తెను తలపిస్తోంది ఈ ఫోటోషూట్ లో. ముత్యాలు, ఛమ్కీల డిజైనర్ దుస్తుల్లో జాన్వీ నిజంగా ఎంతో అందంగా కనిపిస్తోంది. తనను ఇలా చూశాక.. ఇంద్రుని పుత్రికగా ఇప్పుడు అర్హత సాధించింది! అంటూ ఈ ఫోటోగ్రాఫ్స్ చూశాక అభిమానులు ప్రశంసిస్తున్నారు. జాన్వీ ఒక డైమండ్ అంటూ కొందరు పొగిడేస్తున్నారు. చాలా మంది అభిమానులు లవ్- హార్ట్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న జాన్వీ తదుపరి రామ్ చరణ్ సరసన నటించేందుకు అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక రామ్ చరణ్ కథానాయకుడిగా 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సీక్వెల్ ని తెరకెక్కించేందుకు గతంలో వైజయంతి అధినేత అశ్వనిదత్ ప్రయత్నించారు. అయితే ఈ సీక్వెల్ కథాంశం రెడీ కాలేదు. మునుముందు దీనికి ఆస్కారం ఉంటుందనే అంతా ఆశిస్తున్నారు. ఒకవేళ బ్లాక్ బస్టర్ మూవీకి సీక్వెల్ తెరకెక్కిస్తే కచ్చితంగా జాన్వీ పేరు కథానాయికగా పరిశీలనలో ఉంటుందనడంలో సందేహం లేదు.





# యానిమల్ స్టార్ కి నిద్రలేని రాత్రులు..!

రణబీర్ కపూర్, సందీప్ వంగ కాంబినేషన్ లో వచ్చిన యానిమల్ సినిమా బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. భారీ వసూళ్లు నమోదు చేసిన యానిమల్ సినిమాలో హీరోయిన్ గా రష్మిక మందన్న నటించిన విషయం తెల్సిందే. అయితే రష్మిక మందన్నా కంటే కూడా ఇప్పుడు ఆ సినిమాలో కీలక పాత్రలో నటించిన త్రిప్తి డిమ్రీ గురించి ఎక్కువ చర్చ జరుగుతోంది. నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతున్న క్వాలా అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకులకు త్రిప్తి పరిచయం అయింది. ఆ వెబ్ సిరీస్ పెద్దగా గుర్తింపును తెచ్చి పెట్టలేదు. కానీ ఆ వెబ్ సిరీస్ కారణంగా దర్శకుడు సందీప్ వంగ దృష్టిలో త్రిప్తి డిమ్రీ పడేలా చేసింది అనడంలో సందేహం లేదు. సినిమాలో బోల్డ్ సన్నివేశాలు ఉన్నాయని తెలిసి కూడా కథ కు అవసరం అని భావించి నటించేందుకు ఓకే చెప్పాను అంటూ ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. తాజాగా మరోసారి ఓ ఇంటర్వ్యూలో త్రిప్తి డిమ్రీ మాట్లాడుతూ యానిమల్ సినిమా తర్వాత తన పరిస్థితి ఎలా ఉంది అనే విషయమై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. త్రిప్తి ఇప్పుడు కొత్త నేషనల్ క్రష్ గా పేరు దక్కించుకుంది. యానిమల్ సినిమా తర్వాత తాను చాలా ప్రేమను పొందుతూ ఉన్నాను. నా ఫోన్ ఎప్పుడూ కూడా రింగ్ అవుతూనే ఉంది. నాకు వస్తున్న మెసేజ్ లు చదవడానికి చాలా సమయం పడుతూ ఉంది. నాకు వస్తున్న ప్రశంస మెసేజ్ లు చాలా ఆనందాన్ని కలిగిస్తున్నాయి. నా సోషల్ మీడియా పోస్ట్ లకు మరియు నా ఫోన్ కు వచ్చిన మెసేజ్ లు చదివేందుకు నేను నిద్ర లేని రాత్రులు గడపాల్సి వస్తుందని కూడా సరదాగా త్రిప్తి డిమ్రీ చెప్పుకొచ్చింది. ఓవర్ నైట్ స్టార్ అని అంటూ ఉంటాం... అది త్రిప్తి డిమ్రీ విషయంలో అక్షరాల నిజం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



# 'భీమా' మంగళూరులో షూటింగ్ ప్రారంభం

మాచో స్టార్ గోపీచంద్ హీరోగా ప్రముఖ కన్నడ దర్శకుడు ఎ హర్ష దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'. సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పై కెకె రాధామోహన్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ ఈరోజు మంగళూరులో ప్రారంభమైంది. గోపీచంద్‌తో పాటు ఇతర తారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్‌లో మంగళూరులోని దట్టమైన అడవిలో ఓ సాంగ్, యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి. మాస్, యాక్షన్‌తో కూడిన ఈ సినిమాలో ఫ్యామిలీ ఆడియన్స్‌ని మెప్పించే అంశాలు ఉంటాయి. హై స్టాండర్డ్ టెక్నికల్, ప్రొడక్షన్ వాల్యూస్‌తో భారీ ఎత్తున తెరకెక్కుతున్న ఈ సినిమాలో గోపీచంద్ సరసన ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు.



# ఘనంగా ఆర్జీవీ వ్యూహం 'జగ గర్జన' ఈవెంట్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజకీయ జీవితంలో జరిగిన కొన్ని ఘటనలను ప్రతిబింబిస్తూ ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రూపొందించిన సినిమా "వ్యూహం". ఈ సినిమాను రామదూత క్రియేషన్స్ బ్యానర్ లో దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు. పొలిటికల్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో వైఎస్ జగన్ పాత్రలో అజ్మల్ నటించగా...వైఎస్ భారతి పాత్రలో మానస కనిపించనుంది. వ్యూహం సినిమా ఈ నెల 29న గ్రాండ్ గా థియేటర్స్ లోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో వ్యూహం సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని విజయవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ జీవితంలో జరిగిన ఘటనల ఆధారంగా నేను లక్ష్మీస్ ఎన్టీఆర్ అనే సినిమా చేశాను. కానీ వ్యూహం సినిమా నేపథ్యం ఇప్పుడు మన కళ్ల ముందు జరుగుతున్నదే.

ఇందులో కథ కంటే క్యారెక్టర్స్ కు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు బయటకు ఎలా కనిపిస్తారు, వెనక ఎలాంటి కుట్రలు కుతంత్రాలు వ్యూహాలు పన్నుతారు అనేది నేను సైకలాజికల్ కోణంలో ఈ సినిమాలో తెరకెక్కించాను. నేను రాజకీయాల్లో లేకున్నా, రాజకీయ నాయకుల సైకాలజీని అర్థం చేసుకుంటాను. కాంటెంపరరీ ఇష్యూస్ ఉన్న వ్యూహం లాంటి మూవీ వరల్డ్ సినిమాలో రాలేదని చెప్పగలను. నారా లోకేష్ వ్యూహం సినిమాను ఆపమని కోర్టుకు వెళ్లి అందులో అతను చెప్పిన కారణం మమ్మల్ని కించపరుస్తున్నారని చెప్పాడు. కానీ రోజు లేచిన దగ్గర నుంచి లోకేష్ చేస్తున్న పని జగన్ ను కించపరచడం. అనేక మాటలు, ఆరోపణలు, విమర్శలు చేయడం. ఇలాంటి లోకేష్ తనను కించపరుస్తున్నారని వ్యూహం సినిమాను ఆపమని కోర్టుకు వెళ్లడం ఏంటి. ఎన్టీఆర్ ను చెడ్డవాడిగా చిత్రీకరించిన చంద్రబాబు మళ్లీ ఎక్కడ ఆయన అభిమానుల ఓట్లు పోతాయో అని చెప్పి ఎన్టీఆర్ ను మహానుభావుడు అనడం మొదలుపెట్టాడు. పవన్ జనసేన పెట్టినప్పుడు ఇంప్రెస్ అయ్యా. కానీ ఆయన రాజకీయ నిర్ణయాలు చూసి పవన్ మీద అభిమానం పోయింది. తెలంగాణలో బర్రెలక్క అనే ఒక అమ్మాయి ధైర్యంగా రాజకీయాల్లో నిలబడింది. అలాంటి ధైర్యం కూడా పవన్ కు లేదు. కొందరి చేతిలో కీలుబొమ్మగా మారాడు. నేను వైసీపీ మనిషిని అంటున్నారు. నేనే చెబుతున్నా కదా జగన్ కు ఫేవర్ గానే వ్యూహం సినిమా ఉంటుంది. డెఫనెట్ గా ఈ నెల 29న వ్యూహం సినిమా రిలీజ్ చేస్తాం. అన్నారు.

# సంక్రాంతికి 'మిషన్ చాప్టర్ 1'



2.0, పొన్నియిన్ సెల్వన్ వంటి సినిమాలను నిర్మించి అందరి మన్ననలు అందుకుని ఇప్పుడు ఇండియన్ 2, రజినీకాంత్ 170 చిత్రాలతో ఆడియెన్స్‌ని వావ్ అనిపించటానికి సిద్ధమవుతోన్న నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్. భారీ బడ్జెట్ సినిమాలనే కాదు, డిఫరెంట్ కంటెంట్ చిత్రాలను కూడా పేక్షకులకు అందించటానికి లైకా సంస్థ ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది. ఆ కోవలో లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ నుంచి రాబోతున్న మరో డిఫరెంట్ మూవీ 'మిషన్ చాప్టర్ 1'. అరుణ్ విజయ్, ఎమీ జాక్సన్, నిమిషా సజయన్ హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న ఈ చిత్రంలో అబి హాసన్, భరత్ బొపన్న, బేబి ఇయల్ ప్రధాన పాత్రల్లో మెప్పించనున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ విజయ్ తెరకెక్కిస్తోన్న ఈ చిత్రానికి ఎం.రాజశేఖర్, ఎస్.స్వాతి నిర్మాతలు. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్. కోలీవుడ్ హీరో అరుణ్ విజయ్ హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ భారీ బడ్జెట్ మూవీ 'మిషన్: చాప్టర్ 1' తాజాగా లైకా ప్రొడక్షన్స్ నుంచి రాబోతున్నక్రేజీ చిత్రాల సినిమాల లిస్టులో చేరింది. ఈ చిత్రానికి ఎం. రాజశేఖర్, ఎస్.స్వాతి నిర్మాతలు.
చిత్రాన్ని కేవలం 70 రోజుల్లో లండన్, చెన్నై సహా పలు లొకేషన్స్‌లో శరవేగంగా చిత్రీకరించటం గొప్ప విషయం. 2.0లో నటించి అలరించిన ముద్దుగుమ్మ ఎమీ జాక్సన్ 'మిషన్ చాప్టర్ 1' చిత్రంతో రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె జైలర్ పాత్రలో మెప్పించబోతున్నారు. మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన విలక్షణ నటి నిమిషా సజయన్ ఈ మూవీలో ఓ కీలక పాత్రను పోషించారు. జి.వి.ప్రకాష్ ఈ చిత్రానికి సంగీత సారథ్యాన్ని వహిస్తున్నారు. సినిమాను నాలుగు భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.